# 22. బాధ్యత

సాహిత్యానికి ప్రయోజనముండాలని హృదయపూర్వకంగా భావించి, వ్యాపార మసాలాల జోలికి పోకుండా ఉత్తమ రచనలతో సాహిత్య పత్రిక నడిపిద్దామని ప్రయత్నించి ఎన్నిసార్లు చేతులుకాల్చు కున్నా విరమించుకోక మళ్ళీ సాహిత్యపత్రికను ప్రారంభించిన సాహిత్యారాధకుడిలా మరోసారి చెట్టు దగ్గరికెళ్ళాడు రమాపతిరావు చెట్టెక్కి శవాన్ని భుజంపై వేసుకొని చెట్టుదిగి శ్మశానం దిక్కు తొందర గా నడుస్తున్నాడు, శవంలోని భేతాళుడతనితో

"ఓ మానవా! నిన్ను చూస్తుంటే నువ్వు దేశంకోసం పాటుబడి అలసిపోయినవాడిలా కనబడుతున్నావు జీవనపోరాటంలో ఆర్థికంగా చితికిపోయినట్టు అగుపడుతున్నావు. నీ కోరికేంటో చెబుతావా ?" అన్నాడు.

అవును... నేను నా విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య పోరాట పిలుపువిని రంగంలో ఉరికాను చదువు మానుకున్నాను. కుటుంబం గూర్చి పట్టించు కోలేదు విదేశీ పాలన పోవాలని గొంతుచించుకొని అరిచాను, రజాకార్ వ్యతిరేక పోరాటంలో కూడా పాల్గొన్నాను లాఠీ దెబ్బలు తిన్నాను, బూటుతన్నులు తిన్నాను. ఎన్నోసార్లు అరెస్టయ్యాను. ఎంతో హింస ననుభవించాను, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని విని ఎంతో సంతో షించాను ఎగిరి గంతేసాను అటుతర్వాత చిన్నచిన్న నిలకడలేని ఉద్యోగాలుచేసి రిటైరయ్యాను. ఆర్థికంగా ఏమాత్రం కోలుకోలేదు. స్వాతంత్ర్య సమరయోధులకు పింఛను ఇస్తున్నారని దరఖాస్తు పెట్టు

ఉన్నాను కాని, ఎంత ప్రయత్నించినా వాళ్ళు తెమ్మన్న డాక్యుమెంట్లు తేలేకపోయాను. మరోదిక్కు స్వాతంత్ర్య పోరాటం గూర్చి ప్రాథమిక పరిజ్ఞానం కూడాలేని వాళ్ళు స్వాతంత్ర్య సమరయోధుల ఫించను పొందుతున్నారు. నిజంగా పాల్గొన్న నాలాంటి వాళ్ళేమో నిస్సహాయంగా చూస్తున్నారు నా అన్ని ప్రయత్నాలు నిష్ఫలం కాగా ఈ ప్రయత్నం చేస్తున్నాను. ''

గొణుక్కున్నట్టనుకొని మౌనంగా నడుస్తున్నాడు రమాపతిరావు. మాట్లాడని రమాపతిరావుతో భేతాళుడు

"నీ ప్రయత్నం చెప్పకున్నా ఫరవాలేదు నీకు నా బరువు తెలియకుండా ఉండడానికో కథ చెబుతాను.... విను .. " అని కథ చెప్ప సాగాడు.

ప్రపంచం పరిణామశీలం కలది. కోతిదశనుండి పరిణామం చెందుతూ మనిషి ప్రస్తుత రూపంలోకొచ్చాడు ఆకులలములు కట్టుకుంటూ అడవుల్లో దొరికిన గడ్డలు, దుంపలు తింటూ తిరిగే మనిషి క్రమంగా బట్టలు కట్టుకోవడం నేర్చుకున్నాడు. ఉడకబెట్టుకొని తినడం నేర్చుకున్నాడు ఉరుము ఉరిమినా, మెరుపు మెరిసినా కారణాలు తెలియక అదో అద్భుతంగా భావించే మనిషి విజ్ఞానపరంగా ఎంతో అభివృద్ధి సాధించాడు అలాగే ప్రపంచవ్యాప్తంగా దేశాలు రాజులపాలన నుండి, భూస్వామ్య వ్యవస్థనుండి ప్రజలే పాలకులయ్యే ప్రస్తుత స్థితికి వచ్చాయి ... దేశంనుండి ఒకప్పుడున్న పరాయిపాలనలోంచి ప్రజాపాలనలోకి వచ్చింది. ఆ దేశం సోషలిజం దిక్కు పయనిస్తుందని గద్దెలమీద ఉన్న వాళ్ళే చెబుతున్నారు, ఏదేమైనా ఆ దేశం కళలకు చాలా ప్రసిద్ధి.

అయితే ఏ కళ ఐనా ప్రజలపై ప్రభావం చూపడం ముఖ్యంగా యువతరాన్నెక్కువగా ప్రభావితం చేయడం మామూలే–

అందులో సినిమాలు, సాహిత్యం యువతరంపై చెప్పుకోదగ్గ ముద్రవేస్తాయనడంలో సందేహం లేదు. ఏ కళయినా రెండుదిక్కులా పదునున్న కత్తిలాంటిది. అది ప్రజలపై మంచి, చెడు రెండు ప్రభావాలను కల్గి చగలుగుతుంది. దాన్ని మనం ఉపయోగించే తీరునుబట్టి ఆ ప్రభావముంటుంది దురదృష్టవశాత్తు ఆ దేశంలో అనేక పత్రికలున్నా, అసంఖ్యాకంగా సినిమాలొస్తున్నా అవి ప్రజలపై మంచి ప్రభావంకంటె చెడు ప్రభావాన్నే ఎక్కువ చూపుతున్నాయి కొన్ని పత్రికలు. సినిమాలు ప్రజలే మరచిపోతున్న భూతప్రేతాలగూర్చి గొప్పగా చెబుతూ ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నాయి. ప్రపంచం ఓ దిక్కు వాస్తవికదృక్పథంతో, వైజ్ఞానికంగా ఎంతో ముందుకు పోతుంది. మరి ఈ రచయితలేమో అవాస్తవిక సంఘటనలతో, అభూత కల్పనలతో సంచలనాలను సృష్టిస్తూ యువతరాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. కొన్ని సినిమాలు, పత్రికలు మితిమీరిన సెక్సుతో, అవాస్తవిక ప్రేమ కథలతో హింస, క్రైమ్, థ్రిల్లర్ లాంటివాటితో జనాలను గజిబిజి చేస్తున్నాయి కొంతమంది కళాత్మకమైన సినిమాలు తీస్తున్నా అవి బాక్సాఫీసువద్ద ఫెయిలవుతున్నాయి. అలాగే మంచి సాహిత్యంతో నడిపే పత్రికలు ఎక్కువగా నడవడంలేదు.

అయితే కొందరు మేధావులు, యువకులు ఇలాంటి సినిమాలు, సాహిత్యం [దుష్ప్రభావం కల్గించేవి] వద్దని ఆందోళన చేస్తున్నారు. అయినా జరిగేది జరుగుతూనే వుంది.—

చెప్పడం ఆపి భేతాళుడు

"రచయితకు సామాజిక బాధ్యత ఉండాల్సిన అవసరం లేదా?

చాలామంది రచయితలు అలాగే ఎందుకు రాస్తున్నారు.. ?

ఇలాంటి సాహిత్యం కలకాలం నిలుస్తుందా...?

ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలిసే చెప్పక పోయావో జాగ్రత్త.." అన్నాడు.

"కొంత మేదా సంపత్తి ఉన్నవాడే రచయితయ్యే అవకాశముంది రచయితనేవాడు సామాజిక బాధ్యత గుర్తెరిగి రచనలు చేయాలి అలా కాక రచనలు చేయడం కంటె చేయకుండా ఉండడమే మంచిది. సమాజం ముందుకు పోవడానికి, మానవుడి సుఖమయ బ్రతుక్కొరకు అవసరమైనవాట్ని గురించి చెబుతూ జనజీవన సంస్కృతిని ప్రతిబింబిస్తూ, ప్రజలకు కర్తవ్యాన్ను దేశిస్తూ రచనలు చేయాలి. కాని మధ్యయుగాల నాటి సంస్కృతిని సమర్థిచడం మనిషిని వెనక్కి లాగడం రచయితలు చేయాల్సిన పనికాదు.

తాత్కాలిక ప్రయోజన మాశించి డబ్బుకొరకో - కీర్తిప్రతిష్ఠల కొరకో తమ బాధ్యతను మరచి రచయితలు రచనలు చేస్తున్నారు. అలాగే కళలు కూడా ఆది సాహిత్యంలో అవాంఛనీయ ధోరణి

ఇలాంటి రచనలు కలకాలం నిలుస్తాయినుకోవడం పొరపాటు.. ముందుచూపులేక మనిషిని వెనుకకు లాక్కుపోయే రచనలు ఆ రచయితతోపాటే ముగుస్తాయి. సామాజిక స్పృహ కలిగివుండి జనాలను ముందుకు నడిపించే రచనలే కలకాలం నిలుస్తాయి ఇందుకు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉదాహరణలున్నాయి..."

రఘుపతిరావుకు మౌనభంగం కలిగి తానాశించిన సమాధానాలు రాగానే శవంతో మాయమై చెట్టెక్కాడు భేతాళుడు.

[ జీవగడ్డ జనవరి, 1987 ]